క్లుప్తంగా

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

చినగంజాం: శాఖా గ్రంథాలయం చినగంజాంలో మే 16 నుంచి జూన్ 7 వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు ఆళహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు తెలిపారు. 10 నుంచి 15 ఏళ్లలోపు 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ శిబిరంలో కథలు చదివి వినిపించటం, ఆటలు ఆడించడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, డాన్స్, పప్పెట్ మేకింగ్, డ్రామా, చెస్, క్యారమ్స్, ఇతర అంశాలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు గ్రంథపాలకుడుని సంప్రదించాలని కోరారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

చీరాల అర్బన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించినట్లు గ్రంథపాలకురాలు డి.ధనమ్మ తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయడం వలన విజ్ఞానం పెరుగుతుందన్నారు. శిక్షణలో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై గ్రంథాలయానికి కొత్తగా వచ్చిన పుస్తక సంపదను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

యద్దనపూడి: మండలంలోని గన్నవరం–మార్టూరు దండు దారి వద్ద వేంచేసి ఉన్న గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఈ నెల 17వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళగిరి కమలాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి సుప్రభాతం, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. 11 గంటల నుంచి అన్నదానం ఉంటుందని, పరిసర గ్రామాల ప్రజలు స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

దళిత యువకులు అల్లర్లకు దూరంగా ఉండాలి

చీరాల రూరల్: ఎలక్షన్ల అనంతరం రాజకీయ పార్టీల గొడవలకు, అల్లర్లకు దళిత యువకులు దూరంగా ఉండాలని మాలభేరి జాతీయ యువజన అధ్యక్షుడు చప్పిడి ప్రియతమ్ సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల అనంతరం కొన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళిత యువకులకు డబ్బులు ఆశ చూపించి గొడవలకు ప్రోత్సహించే ప్రమాదం ఉందన్నారు. డబ్బులకు ఆశపడి గొడవలు, అల్లర్లకు పాల్పడినట్లయితే పోలీసు కేసులు నమోదవుతాయని తద్వారా పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి పరువు, డబ్బులు పోగొట్టుకుని మన వలన మన కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. పోలీసు కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాల రావని, రౌడీ షీట్లు కూడా తెరిచే అవకాశం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఒకసారి పోలీసు కేసు నమోదైతే ప్రతిసారి జరిగే ఎలక్షన్‌లకు పోలీసులు స్టేషన్లకు తీసుకెళ్లి ఎలక్షన్‌లు అయ్యే వరకు పోలీసు స్టేషన్లలో కూర్చోపెడతారని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు వచ్చి ప్రలోభాలకు గురిచేసినా, రెచ్చగొట్టినా ఎవరూ అల్లర్లకు పాల్పడవద్దని ఆయన సూచించారు.

సంక్షేమ చైతన్యంతో ఓటెత్తిన మహిళలు

- బాపట్ల జిల్లాలోనే అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైన నియోజకవర్గంగా అద్దంకి
- పోస్టల్ బ్యాలెట్లు సైతం 89.35 శాతంగా నమోదు
- వైఎస్సార్ సీపీకి అనుకూలం అంటున్న విశ్లేషకులు


అద్దంకిలో క్యూలో నిలబడిన ఓటర్లు (ఫైల్)

అద్దంకి: నియోజకవర్గంలో మహిళా ఓటర్ల పోలింగ్ శాతం అధికంగా నమోదు కావడంతో సంక్షేమ పథకాలకు అనుకూలంగా మహిళలు ఓటు వేసి ఉంటారని వైఎస్సార్ సీపీ వర్గాలు భావిస్తున్నాయి. మరో వైపు జిల్లాలోనే అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైన నియోజకవర్గంగా అద్దంకి నిలిచింది.

మహిళా ఓటర్ల శాతమే అధికం..

నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఓటర్లున్నారు. వారిలో 2,14,701 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 1,24,475 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 1,19,570 మంది పురుష ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంటే పురుషుల కంటే మహిళా ఓటర్లు 4,905 మంది అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 1506 మంది ఎన్నికల డ్యూటీలో ఉంటూ పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోగా, కొత్తగా పోలింగ్ బూత్‌కు వెళ్లలేని వారు 196 మంది తొలిసారిగా హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకుని ఓటు వేశారు.

వైఎస్సార్ సీపీకి అనుకూలమే...

గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక పోలింగ్ శాతం అద్దంకిలో నమోదు కావడం, మహిళా ఓటర్లలో చైతన్యం పెరగడం చూస్తుంటే, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలు బాగా పనిచేసి ఉంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దాంతో తాము అత్యధిక మెజారిటీతో గెలవబోతున్నామని వైఎస్సార్ సీపీ వర్గాలు చెబుతున్నాయి.

పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ఇంటర్మీడియెట్ విద్యార్థిని ప్రవళికను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రోటరీ క్లబ్, ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను అందించారు. స్థానిక రోటరీ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. దోగుపర్తి వెంకట సురేష్ పుట్టిన రోజు సందర్భంగా బాపట్ల జిల్లాలో ఇంటర్మీడియెట్‌లో మొదటి ర్యాంకు సాధించిన తుమ్మలపెంట ప్రవళికను, ఆమె తల్లిదండ్రులను సన్మానించి రూ.5616 నగదు బహుమతి అందించారు. అలానే చీరాల మండలంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పది మంది బాలబాలికలను సన్మానించి మెమెంటో, ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదు బహుమతులు ఇచ్చారు. అలానే రామస్తంభంలో పేదలకు అన్నదానం కోసం 25 కేజీల బియ్యం, ప్రభుత్వ హాస్పిటల్‌లో బాలింతలకు, వెంట వచ్చిన వారికి అన్నదానం కోసం రూ.2500 పూర మస్తాన్ రావు చారిటబుల్ ట్రస్టుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, చీరాల కృష్ణమూర్తి, చారుగుళ్ల గురుప్రసాద్, బి.హేమంత్‌కుమార్, మేడూరి శేషసాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి చలివేంద్రం ఏర్పాటు


మంచినీటి చలివేంద్రం ప్రారంభించిన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల రూరల్: మంచినీటి చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ అన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పేరాల కూరగాయల మార్కెట్ ఎదురు ఎల్‌జీ షోరూం పక్కన వాకర్స్ సభ్యుడు గుద్దంటి రమేష్ బాబు సహకారంతో చల్లటి మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మండుతున్న ఎండలకు వేసవి తాపాన్ని తీర్చేందుకు వాకర్స్ సభ్యుడు రమేష్ బాబు ఎంతో దాతృత్వంతో మంచి నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం మంచి పరిణామమని కొనియాడారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డెంగీపై ర్యాలీ

బల్లికురవ: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహ్మద్ బుధవారం తెలిపారు. గుంటుపల్లి పీహెచ్‌సీ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ.. గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ నాలుగు రోడ్ల కూడలి వరకు కొనసాగుతుందని చెప్పారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సేవా సంస్థలు పాల్గొని జయప్రదం చేయాలని వైద్యాధికారి కోరారు.

బల్లికురవ కళాశాలలో అడ్మిషన్లు

బల్లికురవ: బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించామని, జూన్ 1 నుంచి తరగతులు జరుగుతాయని ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ తెలిపారు. అనుభవీయులైన అధ్యాపకుల స్వీయ పర్యవేక్షణలో ఒత్తిడి లేని విద్యను అందిస్తూ రెండు దశాబ్దాలుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలతో విద్యార్థులు అభినందనలు అందుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటికే తమ అధ్యాపకులతో కలిసి బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం, కొప్పెరపాలెం, కొణిదెన గ్రామాల్లో క్యాంపెయిన్‌లు నిర్వహించామని తెలిపారు. సీఈసీ, ఎంపీసీ, బైపీసీ గ్రూపులను తెలుగు, ఇంగ్లిషు మీడియంలో బోధిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

180 మందికి పెన్షన్లు, బియ్యం పంపిణీ



వృద్ధులకు పెన్షన్లు, బియ్యం అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (ఆవోపా) ఆధ్వర్యంలో బుధవారం వికలాంగులు, వృద్ధులకు పెన్షన్లు, బియ్యం పంపిణీ చేశారు. స్థానిక ఆవోపా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆవోపా వ్యవస్థాపకుడు కేఆర్ కృష్ణయ్య చెట్టి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వికలాంగులు, వృద్ధులు మొత్తం 180 మందికి పెన్షన్లు, బియ్యం పంపిణీ చేసి భోజనం అందించారు. ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ఎంతో మందికి ఉపయోగపడ్డాయని ముఖ్య అతిథిగా హాజరైన వల్లంపట్ల వెంకటేశ్వరరావు కొనియాడారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, కోశాధికారి పేర్ల వెంకట రామయ్య, దోగుపర్తి సురేష్, శ్రీనివాసరావు, మారుటూరి రాఘవేంద్రరావు, పోలిశెట్టి శ్యామ్, విశ్వం, భాగ్యలక్ష్మి, పద్మజ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావైద్యుడు, అర్చకుడు నరసింహాచార్యులు మృతి


నరసింహాచార్యులు (ఫైల్)

యద్దనపూడి: మండలంలోని పూనూరు వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు, ప్రజావైద్యుడు దీవి నరసింహాచార్యులు (54) అనారోగ్యంతో మృతి చెందారు. ఆరు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు దీవి వారి కుటుంబం ఉచిత వైద్యం అందించటం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అర్చకత్వంతో పాటు వైద్య వృత్తిని దైవంగా భావించి ఉచిత వైద్యసేవలు అందించే నరసింహాచార్యులు మృతి చెందటంతో యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, పర్చూరు తదితర మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. నరసింహాచార్యులు తండ్రి లక్ష్మణాచార్యులు 60 సంవత్సరాల క్రితం గ్రామంలో వైద్య వృత్తిని ప్రారంభించగా ఆయన పెద్ద కుమారుడు బావానాచార్యులు, చిన్న కుమారుడు నరసింహాచార్యులు వారసత్వంగా వైద్య వృత్తిని కొనసాగిస్తూ పరిసర గ్రామాల్లో మంచి హస్తవాసి ఉన్న వైద్యులుగా కీర్తి ప్రతిష్టలు ఘడించారు. రోగుల నుంచి ఎలాంటి ఫీజు తీసుకోకపోవటం, ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండటంతో పాటు ఇంటింటికీ తిరిగి అర్ధరాత్రి 2 గంటల వరకు వైద్యసేవలు అందించటంతో పాటు ఉచితంగా మందులు అందిచటంతో వీరి కుటుంబానికి పరిసర ప్రాంతాల్లో మంచి పేరు ఉంది. ఈ క్రమంలో కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నరసింహాచార్యులు బుధవారం మృతి చెందటంతో వేలాదిగా వచ్చిన ప్రజలు వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అశ్రునయనాల మధ్య నరసింహాచార్యులు మృతదేహానికి బుధవారం సాయంత్రం స్వగ్రామంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

అనాథలకు అన్నదానం



అనాథలకు అన్నం ప్యాకెట్‌లు అందిస్తున్న రోటరీ సభ్యులు

వేటపాలెం: స్థానిక రోటర్లీ క్లబ్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న అనాథలకు బుధవారం రాత్రి అన్నదానం చేశారు. విశ్రాంత ఏఈ ఏరాసు గణపతి ఆర్థిక సహకారంతో అన్నదానం చేసినట్లు రోటరీ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి ఏవి సురేష్‌బాబు, ప్రత్తి వెంకట సుబ్బారావు, పిచ్చుక నాగరాజు పాల్గొన్నారు.

నేడు దేవాలయ భూములకు కౌలు వేలం

జే.పంగులూరు: పంగులూరు గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయం భూములు, వీరేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాల భూములకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి యు.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. భీమలింగేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన 120, 121, 151, 410 సర్వే నంబర్లలో 47 ఎకరాల 28 సెంట్ల మెట్ట భూమి, వీరేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి 4, 263 సర్వే నంబర్లలోని 25 ఎకరాల మెట్ట భూమికి, వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించి 316, 322 సర్వే నంబర్లకు సంబంధించి 14 ఎకరాల 34 సెంట్ల మెట్ట భూమికి బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023–24 నుంచి 2026–27 సంవత్సరం వరకు కౌలు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. ఈ కౌలు వేలం పాటలో పాల్గొనదలచిన వారు పాటకు ముందు రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. పాట ముగిసిన వెంటనే ఎక్కువ పాట పాడిన వారు డిపాజిట్ కూడా ఒక సంవత్సరానికి మొత్తం చెల్లించాలని తెలిపారు. పాటలో పాల్గొనదలచిన వారు 16వ తేదీ ఉదయం 9 గంటలకు వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద దేవాదయ ధర్మాదాయ శాఖా అధికారుల సమక్షంలో జరిగే బహిరంగ కౌలు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ఇంటింటికీ వైద్య సేవలు


మల్లాయపాలెంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: వైద్య వసతిలేని గ్రామీణ ప్రాంతాలకు 104 వాహనం ద్వారా ప్రతిరోజూ షెడ్యూల్ ప్రకారం ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జీ రవితేజ తెలిపారు. బుధవారం పాత మల్లాయపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 104 వాహనం ద్వారా చిన్నారులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులకు వివిధ పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేశారు. క్యాంపునకు రాలేని వృద్ధులకు సాయంత్రం ఇంటికి వెళ్లి పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్నిర కాల సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోవద్దని వైద్యాధికారి సూచించారు. క్యాంపులో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాయ్..రాజా కాయ్!

పుల్లలచెరువు: సార్వత్రిక ఎన్నిక పోరు ముగిసింది. గెలుపు తమదంటే తమదిని ఆయా పార్టీల నేతలు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గెలుపోటములపై పందెలు కూడా అదే స్థాయిలో ఊపందుకున్నాయి. తమదే విజయం అంటూ ఆయా పార్టీల అభిమానులు బెట్టింగ్‌లకు సిద్ధం అవుతున్నారు. కేవలం నియోజకవర్గం, జిల్లాలోనే కాకుండా 175 స్థానాలపై కూడా పందెలు జోరుగా సాగుతున్నాయని ప్రజలు గ్రామాల్లోని రచ్చబండల వద్ద చర్చించుకుంటున్నారు. కొంతమంది వైఎస్సార్ సీపీ, టీడీపీ ప్రభుత్వాలు ఏర్పాటు మధ్య బెట్టింగ్‌లు కాస్తున్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి


కోటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జే.పంగులూరు: అనారోగ్యంతో పంగులూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు తన్నీరు కోటేశ్వరరావు (69) బుధవారం మృతి చెందాడు. గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో ఆయన బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహానికి పార్టీ మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, గ్రామ నాయకుడు రావూరి శ్రీను పూలమాల వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. గ్రామ నాయకులు బాచిన ఆంజనేయులు, మౌలాలి, కుంచాల సాంబయ్య, కట్టా నాగేశ్వరరావు, బాచిన అకిల్, సుభాని తదితరులు నివాళులర్పించారు.

కురిచేడులో 92.21 శాతం పోలింగ్

కురిచేడు: సాధారణ ఎన్నికల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా రాత్రి 9 గంటల వరకు ఓపికగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కురిచేడు మండలంలో మొత్తం 32,330 ఓట్లు ఉండగా 29,570 ఓట్లు పోలయ్యాయి. 91.82 శాతం రికార్డయింది. 2019 ఎన్నికల్లో 96 శాతం ఓట్లు పోలు కాగా ఈసారి ఈవీఎంలు మొరాయించడంతో పాటు నిదానంగా పనిచేయడంతో ఓట్లు శాతం నమోదైంది. దొనకొండ మండలంలో మొత్తం 37,805 ఓట్లు ఉండగా 34,848 ఓట్లు పోలయ్యాయి. 92.21 శాతం పోలింగ్ నమోదైంది. బూత్‌ల వారీ ఓటర్లు, ఓటు హక్కు వినియోగించుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.


ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

అనాథలను అక్కున చేర్చుకున్న కాశయ్య

కురిచేడు: మండలంలోని శ్రీకరుణా వృద్ధాశ్రమం నిర్వాహకుడు కాశయ్య బుధవారం నరసరావుపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఇద్దరు అనాథ వృద్ధులను తన ఆశ్రమానికి తీసుకొచ్చారు. పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న నారాయణమూర్తి ఇచ్చిన సమాచారం మేరకు నరసరావుపేట వెళ్లి వారిని తీసుకొచ్చినట్లు కాశయ్య తెలిపారు. ఓ వృద్ధురాలు, వృద్ధుడు దిక్కు లేని స్థితిలో చెట్లకింద తలదాచుకుంటున్నారు. వారితో అక్కడే స్నానం చేయించి దుస్తులు మార్చి ఆశ్రమానికి తీసుకొచ్చారు.

రగ్బీ సమ్మర్ కోచింగ్ ప్రారంభం

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బొద్దికూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రకాశం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రగ్బీ సమ్మర్ కోచింగ్ సెంటర్‌ను రగ్బీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, జిల్లా ప్రెసిడెంట్ ఎస్.చంద్రశేఖరరావు బుధవారం ప్రారంభించారు. కోచింగ్ క్యాంపులో ఆశక్తి ఉన్న పదేళ్ల వయసు నుంచి పదహారేళ్ల వయసు యువకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం ఐదున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి ఏడు గంటల వరకు కోచింగ్ ఇవ్వనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.రవిప్రసాదరెడ్డి తెలిపారు. ఆశక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జి.రాజేశ్వరి, విశ్రాంత ఉపాధ్యాయులు పి.సుబ్బారావు, ఎస్.అంజిరెడ్డి పాల్గొన్నారు.


రగ్బీ సమ్మర్ కోచింగ్‌ను ప్రారంభిస్తున్న చంద్రశేఖరరావు


ధ్వంసమైన కారు ముందు భాగం

కారు.. పాల వాహనం ఢీ

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరంలో కారు–పాల వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. బొద్దికూరపాడు నుంచి దర్శి వెళ్తున్న కారు తూర్పుగంగవరంలో రోడ్డుపైకి వస్తున్న సమయంలో ఒంగోలు నుంచి తూర్పుగంగవరంలోకి వస్తున్న పాలవాహనం.. కారును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు లేక పోవడంతో పాటు ఆ సమయంలో ఆ మార్గంలో పాదచారులు ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు

పుల్లలచెరువు: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఘర్షణలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. అందులో శతకోడులో ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో పలువురికి గాయాలయ్యాయి. జిల్లా అధికారుల ఆదేశాలపై గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా సోదరభావంతో ఉండాలిగానీ కక్షలు దృష్టిలో పెట్టుకుని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రత్యేక పోలీసులు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తారని, అనుమానితులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. త్వరలో ఎన్నికల కౌంటింగ్ జరిగే సమయంలో కూడా గ్రామాల్లోని వివిధ పార్టీల అభిమానులు శాంతియుతంగా ఉండాలని, లేకుంటే వారిని గుర్తించి కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతామని చెప్పారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com